జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com



* రథసప్తమి వేడుకలకు పైసా విదల్చని ప్రభుత్వం
* రెండు కోట్లు మంజూరు చేసిందన్న ఎమ్మెల్యే
* జీవోకే పరిమితం
* సొమ్ముల సేకరణకు ఒక కమిటీ
* బిల్లుల కోసం ఎదురుచూస్తున్న కాంట్రాక్టర్లు
* జనం సొమ్ముతో నేతల షోకులపై విమర్శలు
* ఎంత నిధులు విడుదల చేసిందన్న దానిపై స్పష్టత ఇవ్వని జిల్లా యంత్రాంగం
* నేతల భజనకే జిల్లా అధికారులు పరిమితమయ్యారని విమర్శలు చక్కర్లు



## జనం సొమ్ములతో..
# నేతల షోకులు



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 2 (వార్త):** రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండగగా గుర్తించిన కూటమి ప్రభుత్వం.. ఒక్క పైసా కూడా విడుదల చేయలేదని తెలిసింది. గత ఏడాది మూడు రోజులకు వేడుకలు పరిమితం చేయగా, ఈసారి వారం రోజుల పండగని గొప్పగా ప్రకటించింది. దీంతో జిల్లావాసులు సంబరపడిపోయారు. వేడుకలకు ముందు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రభుత్వ పెద్దలకు ఆహ్వానం పలికారు. అలాగే వేడుకలకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని కోరారు. అయితే రథసప్తమి వేడుకలకు రెండు కోట్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే ప్రకటించారు. ఈసారి రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకాకుళం నగరం విద్యుద్దీపాలతో ధగధగమెరిసింది. కేఆర్ స్టేడియంలో మూడు రోజులు పాటు పలు షోలు భారీగా జరిగాయి. ఒక పక్క హెలీకాప్టర్ రైడ్, మరోపక్క హాట్ బెలూన్ రైడ్‌ను ఏర్పాటు చేశారు. వేడుకలు పూర్తయినప్పటికీ ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం విడుదల చేయలేదని టాక్ కొందరు అధికారుల నుంచి వినిపిస్తోంది. అయితే సంబరాలకు దాతల నుంచి పెద్ద ఎత్తున మొత్తాలను కలెక్షన్ చేసినట్టు తెలిసింది. జనం సొమ్ముతో సంబరాలు చేసేందుకు అధికారులు విరాళాలు సేకరించారని, దీనికి గాను ఒక కమిటీని కూడా ఏర్పాటు చేయడమే గాకుండా నిధుల సేకరణ వారికే అప్పగించినట్టు గుసగుసలు వినిపించాయి. ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులు రాకపోవడంతో ఆయా శాఖలు కూడా కొంత సొమ్మును మంజూరు చేసింది. భారీగా సమీకరించిన నిధులతో హంగులు, ఆర్భాటాలు చేశారు. గత ఏడాది కూడా ప్రముఖుల డబ్బుతోనే వేడుకలు నిర్వహించగా, ఈసారి కూడా అదే పరిస్థితి. దాతల సొమ్ముతో అట్టహాసంగా కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ అధికార పార్టీ నేతలు మాత్రం గొప్పతనమంతా తమదే అన్నట్టు హడావుడి చేశారు. నగరం ముస్తాబు కోసం పలువురు కాంట్రాక్టర్లు సొమ్ములు ఖర్చు పెట్టారు. బిల్లులు ఎప్పుడు వస్తాయోనని ఎదురుచూస్తున్నారు. ఏదేమైనా సొమ్ములు ప్రజలవి.. షోకులు నేతలవి.. అన్న కామెంట్లు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.



## బంగ్లాదేశ్ చెర నుంచి..
# మత్స్యకారులకు విముక్తి


* కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ
* మత్స్యకారుల విడుదలకు కేంద్ర ప్రభుత్వంతో మంత్రి అచ్చెన్న నిరంతర సంప్రదింపులు
* విశాఖలో ఘన స్వాగతం పలికి.. నిత్యావసర సరుకులు అందజేసిన అధికారులు
* ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 2(వార్త):** బంగ్లాదేశ్ నౌకాదళం చెరలో చిక్కుకున్న తొమ్మిది మంది విజయనగరం జిల్లా మత్స్యకారుల విడుదల వ్యవహారం సుఖాంతమైంది. రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తన శాఖా పరంగా తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ, దౌత్యపరమైన ఒత్తిడి కారణంగా మత్స్యకారులు సోమవారం క్షేమంగా విశాఖ తీరానికి చేరుకున్నారు. అధికారులు వారికి స్వాగతం పలికారు. మూడు నెలలుగా సాగుతున్న ఉత్కంఠకు తెరపడటంతో వారి సంబరాలు మిన్నంటాయి. వారిని నివాసాలకు చేరుకున్నారు. గత అక్టోబర్లో మత్స్యకారులు బంగ్లా దేశ్‌లో బందీలుగా చిక్కుకుపోయారన్న వార్త తెలియగానే మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. కేవలం ఆదేశాలకే పరిమితం కాకుండా, ప్రతి దశలోనూ వ్యక్తిగత పర్యవేక్షణ చేశారు. మత్స్యశాఖ మంత్రిగా అధికారులను వెంటనే అప్రమత్తం చేసి, పడవ రిజిస్ట్రేషన్ వివరాలు, మత్స్యకారుల చిరునామాలను సేకరించి కేంద్ర విదేశాంగ శాఖకు నివేదించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు వద్దకు స్వయంగా సమస్యను వివరించారు మత్స్యకారుల దీనస్థితిని వివరించి కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాయించడంలో కీలక పాత్ర పోషించారు. మూడు నెలల కాలంలో విడుదల కావడంలో మంత్రి అచ్చెన్నాయుడు చేసిన కృషి అభినందనీయమని మత్స్యకారులు సంతోషాన్ని పంచుకున్నారు. భారత కోస్ట్‌గార్డ్, బంగ్లాదేశ్ అధికారులతో మత్స్యశాఖ ఉన్నతాధికారులు నిరంతరం టచ్‌లో ఉండేలా చూస్తూ, విడుదల ప్రక్రియలో ఎదురైన సాంకేతిక అడ్డంకులను తొలగించారు. బంగ్లాదేశ్ సరిహద్దుల నుంచి విడుదలైన మత్స్యకారులు సోమవారం ఉదయం విశాఖ చేరుకున్నారు. తమను సురక్షితంగా రప్పించడంలో అహర్నిశలు కృషి చేసిన మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మత్స్యకారుల కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మా అచ్చెన్నాయుడు మాకు పెద్ద దిక్కుగా నిలబడ్డారు.. ఆయన చొరవ వల్లే ఈ రోజు మా వారు కళ్లముందు ఉన్నారని మత్స్యకార మహిళలు భావోద్వేగానికి లోనయ్యారు.



### మత్స్యకారుల శ్రేయస్సే లక్ష్యం

ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. మత్స్యశాఖ మంత్రిగా మా మత్స్యకారుల క్షేమమే మాకు ప్రథమ ప్రాధాన్యం. బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తతలు ఉన్నా, కేంద్ర ప్రభుత్వ సాయంతో వారిని రప్పించగలిగాం. ఆపదలో ఉన్న మత్స్యకారులను ఆదుకోవడంలో ఈ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.



4లో

## వాసుదేవుని బ్రహ్మోత్సవాలకు వేళాయె

* 7 నుంచి 13వరకు బ్రహ్మోత్సవాలు
* ముస్తాబవుతున్న మందస
* ప్రముఖులకు ఆహ్వానం పలుకుతున్న శ్రీవాసుదేవసేవాసమితి
* ఏర్పాట్లు పరిశీలించిన పోలీసు అధికారులు



## అర్జీలు.. గడువులోగా పరిష్కరిస్తాం

* ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట
* శ్రీకాకుళం, టెక్కలిలో గ్రీవెన్స్ నిర్వహణ
* టెక్కలిలో అర్జీలు స్వీకరించిన కలెక్టర్



## రాష్ట్రంలో 'రెడ్‌బుక్' పాలనతో అరాచకం

* నిరంకుశ పాలనతో ప్రతిపక్షాలపై సాగుతున్న కక్షపూరిత దాడులు
* మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
* దాడులకు వ్యతిరేకంగా కాశీబుగ్గలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శాంతియుత నిరసన

లోపల పేజీల్లో

## ఉపాధి హామీ పథకం యథావిధిగా కొనసాగించాలి



**పలాస, ఫిబ్రవరి 2 (వార్త):** ఉపాధి హామీ చట్టం యథావిధిగా అమలు చేయాలని, కొత్తగా తెచ్చిన వి బి జి రామ్ జి పథకం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మాకన్నపల్లి, దానగోర సచివాలయాల అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు టి అజయ్ కుమార్, యన్ గణపతి మాట్లాడుతూ రెండు వందల రోజులు పని కల్పించి, ఆరు వందలు కూలీ ఇవ్వాలని ఒక వైపు కోరుతుంటే ఉన్న చట్టానికి తూట్లు పొడుస్తూ కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టం తీసుకు రావడం విడ్డురంగా ఉందని అన్నారు. ఉపాది చట్టం విది విధానాలు మార్చేసి ఉన్న ఉపాధిని లాగేసి మళ్ళీ పేదలకు వలస బాట పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వామ పక్షాలు, ప్రజా సంఘాలు పోరాడి తెచ్చుకున్న చట్టం రక్షణ కోసం దశల వారి పోరాడుతామని తెలిపారు. కొత్తగా తెచ్చిన చట్టం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెప్పల రాజు, బి.ప్రసాద్, వై.కామేశ్వర రావు, పి.గణపతి, టి.సింహాద్రి, టి.కార్తిక్, యస్ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రానిక్ పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ



**సోంపేట, ఫిబ్రవరి 2(వార్త):** దామోదరపురం రెవెన్యూ గ్రామ పరిధిలో రైతులకు సోమవారం ఎలక్ట్రానిక్ పట్టాదారు పాస్ పుస్తకాలను తహసిల్దార్ బి అప్పలస్వామి, మాజీ జడ్పిటిసి సభ్యులు సూరాడ చంద్రమోహన్ చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు. ఈ గ్రామ పరిధిలో రిసర్వే విజయవంతంగా పూర్తి చేసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాజముద్ర తో పాటు రైతు వివరాలు భూమి ఎల్పీఎం నెంబర్ మ్యాపు అలాగే డిజిటల్ క్యూఆర్ కోడ్ మొదలైన వివరాలతో ముద్రించిన పుస్తకాలను అందజేశారు. 63 మంది రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ నిఖిల్ రెవెన్యూ సిబ్బంది స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## బీసీవై పార్టీ ఎగ్జిక్యూటివ్‌మెంబర్‌గా చంద్రకళ



**ఎల్ఎన్ పేట, ఫిబ్రవరి 2(వార్త):** నూతనంగా ప్రకటించిన స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీలో భారత చైతన్య యువజన పార్టీ బీసీవై స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీలో జిల్లాకు చెందిన మహిళ నాయకురాలు బోరుభద్ర చంద్రకళకు స్థానం కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి ఆమె క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమవుతూ పార్టీ సిద్ధాంతాలను విని పిస్తూ ఆమె సేవలను బీసీవై పార్టీ అధి నేత డి. రామ చంద్ర యాదవ్ గుర్తించి ఈ పదవిని అప్పగించారన్నారు. ఈ నియామకం పై చంద్రకళ స్పందిస్తూ బీసీవై పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీలు తనకు అవకాశం ఇవ్వడం చాలా గర్వ కారణంగా ఉందని, తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధినేతకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బిసివై కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## స్నేహితుడికి ఆర్థిక సాయం



**సోంపేట, ఫిబ్రవరి 2(వార్త):** తోటి స్నేహితుడు అనారోగ్యంతో మంచం పట్టడంతో ఆయన ఆరోగ్యం కుదుటపడాలని కోరుకుంటూ స్నేహితులు కలిసి 30వేల రూపాయల సహాయాన్ని అందజేశారు. సోంపేటలో 1994 – 95 10వ తరగతి బ్యాచ్ కి చెందిన సంగారు కృష్ణారావు తీవ్ర అనారోగ్య సమస్యతో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ పరిస్థితుల్లో అదే బ్యాచ్ కు చెందిన కొంతమంది స్నేహితులు కలిసి చందాలుగా వేసుకొని 30 వేల రూపాయలు జమ చేసి సోమవారం ఆ కుటుంబానికి అందజేశారు. మిత్రుడు త్వరగా కోలుకునేలా భగవంతుడు కరుణించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మిత్ర బృందం సభ్యులు బీన ఈశ్వర్ రావు, గుజ్జల శంకరరావు, చిత్రాడ శ్రీనివాస్, చిన్ని మేదం, తామాడ జానకిరావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో ఎమ్మెల్యే రవికుమార్ పర్యటన



**సరుబుజ్జిలి, ఫిబ్రవరి 2(వార్త):** ఎమ్మెల్యే కూన రవికుమార్ మంగళవారం సరుబు జ్జిలి, బూర్జ మండలాలలో పర్యటిస్తారని ఆమదాలవలస టీడీపీ కార్యాలయ సిబ్బంది సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు సరుబుజ్జిలి లొద్దలపేట గ్రామంలో, బూర్జ మండలం లాభాం గ్రామంలో రేపు ఉదయం 11 గంటలకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఎమ్మెల్యే పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## మున్సిపల్ మినిస్టీరియల్ డైరీ ఆవిష్కరణ



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 2 (వార్త):** పురపాలక సంఘం చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి కమిషనర్ ఎన్ రమేష్ ల చేతుల మీదుగా ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంక్షేమ సంఘం విశాఖపట్నం రీజియన్ – 2026 సంవత్సరం డైరీ మున్సిపల్ ఉద్యోగులు మరియు యూనియన్ సభ్యులు సమక్షంలో డైరీ హ్యాండ్ బుక్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ యూనియన్ జనరల్ సెక్రెటరీ నాయుడు బాబు , యూనియన్ నాయకులు వై.యస్.సి.హెచ్ పప్పాయరాజు, అహమద్, ఉమాభాస్కర్ కార్యాలయ విభాగపు అధికారులు, గుమస్తాలు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 3(వార్త):** కీర్తిపురం మాజీ సర్పంచ్ వలపల చంద్రమ్మ మృతి చెందారు. వలపుల రవణ కుటుంబాన్ని ఎంపీపీ బోర పుష్ప పార్టీ ప్రెసిడెంట్ రాజశేఖర్ రెడ్డి , వైస్ ఎంపీపీ దువ్వు వివేకానంద రెడ్డి, సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పరామర్శించారు.



# రాష్ట్రంలో 'రెడ్‌బుక్' పాలనతో అరాచకం

### -నిరంకుశ పాలనతో ప్రతిపక్షాలపై సాగుతున్న కక్షపూరిత దాడులు
### -మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
### -దాడులకు వ్యతిరేకంగా కాశీబుగ్గలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శాంతియుత నిరసన



**పలాస, ఫిబ్రవరి 2 (వార్త):** రాష్ట్రంలో సామాన్యుడి నుంచి రాష్ట్ర మాజీ మంత్రుల వరకు ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని, నిజాలు బయట పడినప్పుడు నియంతలు ఎప్పుడూ హింసకే పాల్పడతారని చెప్పడానికి ముఖ్య మంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని జంగిల్‌రాజ్‌గా మార్చారని రాష్ట్ర మాజీ మంత్రి , వైయస్ఆర్సీపీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పలాస– కాశీబుగ్గ మున్సిపాలిటీ లో కాశీబుగ్గ బస్టాండ్ వద్ద మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ నివాస గృహాలపై టిడిపి గూండాలు దాడి చేసిన ఘటనకు నిరసనగా వైఎస్ఆర్సిపి పలాస నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు నేతృత్వంలో డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, అక్కడ వైసీపీ శ్రేణులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస రాజ్యం, అరాచక పాలన రోజురోజుకు పెరిగిపోతుందన్నారు. ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ నివాసాలపై టిడిపి గూండాలు దాడి చేసిన తీరు ప్రపంచమంతా చూసింద న్నారు. ఏకంగా మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటికి నిప్పు పెట్టి విధ్వంసం సృష్టిస్తే, అంబటి రాంబాబుపై హత్యాయత్నం చేశారని ఆయన ఆరోపణలు చేశారు. రాష్ట్రాన్ని రావణ కాష్టంగా చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం శతవిధాల ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. రాష్ట్రంలో రాజకీయంగా వైఎస్సార్సీపీని ఎదుర్కోలేక , ప్రజలకు మంచి పాలన అందించడం చేతకాక ఈ దురాగతాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. డైవర్షన్ రాజకీయాలు చేయడంలో చంద్రబాబు దిట్ట అని డాక్టర్ అప్పలరాజు విమర్శించారు. శాంతి భద్రతలు పరిరక్షించవలసిన పోలీసు ఉన్నతాధికారులు సైతం రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారం నడుచుకోవాలంటూ, లేకపోతే వాళ్లపై కూడా చర్యలు తప్పవంటూ కూటమి పాలకులు బెదిరించడంతో పోలీసులు ప్రేక్షకు పాత్ర వహించడం పరిపాటిగా మారిందన్నారు. రాష్ట్రంలో అంబేద్కర్ వ్రాసిన రాజ్యాంగం ప్రకారం పరిపాలన సాగడం లేదని, రెడ్ బుక్ రాజ్యాంగం వల్ల ప్రజల ప్రాణాలకు రక్షణ కరువైన నేపథ్యంలో రాష్ట్ర గవర్నర్ జోక్యం చేసుకొని తక్షణం రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డాక్టర్ అప్పలరాజు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా పోలీస్ యంత్రాంగం, కేంద్ర హోం శాఖ చొరవ తీసుకొని రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి పలాస పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి, పలాస ఎంపీపీ ప్రతినిధి ఉంగసాయి కృష్ణ యాదవ్, వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి బండి దుర్యోధనరావు, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య యాదవ్, వైఎస్ఆర్సిపి ఉపాధ్యక్షులు పైల చిట్టిబాబు, జిల్లా కార్యదర్శి దువ్వాడ మధుకేశ్వరరావు, వైఎస్ఆర్సిపి మందస మండల యువజన అధ్యక్షులు సేనాపతి కిషోర్,వైఎస్ఆర్సిపి పలాస రూరల్ అధ్యక్షులు దువ్వాడ రవి, కౌన్సిలర్లు కర్రీ మాధవరావు, గుజ్జు జోగారావు, దున్న నిర్మల సత్యం, వైఎస్ఆర్సిపి నేతలు అందాల శేషగిరి యాదవ్, చింతాడ గణపతి, బాడ జగన్నాయకులు, బత్తిన తేజ, అగ్గున సూర్యారావు,సొర్ర ఢిల్లీ శ్వరరావు, చింతాడ మాధవరావు, పినకాన ముకుంద, మార్పు కృష్ణ, మార్పు వెంకటరమణ, మల్ల సురేష్, వాయులపల్లి శ్రీనివాసరావు, సరస్వతి, మార్పు యుగంధర్, యాళ్ల సంతోష్, రాపాక శేషగిరి, కర్రి గోపాల్, నర్తు వెంకటరమణ యాదవ్, కిర్రి రాజారావు, బగాధి హరికృష్ణ, అంబటి ఆనంద్, మజ్జి హేమరాజ్, నాగేశ్వర్ బృందావన్, తమ్మి నాన శాంతారామ్, డొక్కరి హరికృష్ణ, దల్లి జానకి రెడ్డి, ఈరోతు హేమ సుందర్,బిరాటి వల్లభ, కంచరాన చినబాబు తదితరులతోపాటు నియోజకవర్గం నలుమూలల నుంచి వైయస్సార్సీపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై డీఎస్పీ సమీక్ష



**మందస, ఫిబ్రవరి 2(వార్త):** మందసలో ఈ నెల 7నుంచి 13వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై కాశీబుగ్గ డీఎస్పీ షేక్ షెహబాజ్ అహ్మద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కాశీబుగ్గరూరల్ సీఐ తిరుపతిరావు, మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ లతో పాటు ఆలయ ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులతో ప్రత్యేకంగా సమావేశం జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భద్రత, భక్తులకు ఏర్పాట్లు, ఆలయ పరిసరాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై చర్చించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే ప్రణాళికపై వారు సమీక్షించారు. అనంతరం ఆలయ పరిసరాలు, ఆవరణను ప్రత్యేకంగా పరిశీలించారు. భక్తులకు క్యూలైన్, కల్యాణం జరిగే ప్రాంతం, శ్రీవాసుదేవుని తెప్పోత్సవం జరిగే గోపాలసాగరం, అన్నదానం వద్ద భక్తుల రద్దీలపై చర్చించారు. భారీగా బందోబస్తు ఏర్పాటు చేయడానికి డీఎస్పీ ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. గోపాలసాగరం వద్ద గజ ఈతగాళ్లను నియమించడం, అగ్నిమాపక వాహనాన్ని అందుబాటులో ఉంచడం, చెప్పులు ఉంచే ప్రదేశం, ట్రాఫిక్ సమస్య, పార్కింగ్ చేసే ప్రదేశంపై డీఎస్పీ షేక్ షెహబాజ్ అహ్మద్ చర్చించి, చేయాల్సిన ఏర్పాట్లు తెలిపారు. అనంతరం మందస పోలీసు స్టేషన్ తనిఖీ చేసి, మందస మండల భౌగోళిక పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సచ్ఛిదానందపాడి, అనిల్కుమార్ స్వామి, మందస పంచాయతీ ఈఓ బమ్మిడి నవీన్ కుమార్, దేవరశెట్టి మార్కండేయులు, డుంకురు తిరుపతిరావు, రాజాన మహేశ్, శానాపతి కిషోర్ కుమార్, జామి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## బుడితి సీహెచ్‌సీ అభివృద్ధికి చర్యలు



**సారవకోట, ఫిబ్రవరి 2(వార్త):** బుడితి సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి కీలక సలహా మండలి (హెచ్‌డీఎస్) సమావేశంలో ఆయన పాల్గొని ఆసుపత్రి ప్రాంగణం, వార్డులను పరిశీలించి అక్కడి సౌకర్యాలపై వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రిలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో హెచ్‌డీఎస్ కమిటీ పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించింది. ముఖ్యంగా పీఎం షెడ్ నిర్మాణం, జనరేటర్ ఏర్పాటు, ప్రస్తుతం 30 పడకలుగా ఉన్న విభాగాన్ని 50 పడకలకు విస్తరించడం, కొత్త పార్కింగ్ షెడ్ నిర్మాణం, హెర్బల్ గార్డెన్ ఏర్పాటు, ఫుల్ టైమ్ అనస్థీషియా డాక్టర్ నియామకం వంటి అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నిర్ణయాలు అమలులోకి వస్తే ఆసుపత్రి వసతులు మరింత మెరుగుపడి రోగులకు అధిక సౌకర్యం కలుగుతుందని అధికారులు తెలిపారు. ప్రాంతీయ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఈ సమావేశం ద్వారా అవసరమైన మార్పులు ముందుకు సాగుతాయని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, ఆసుపత్రి కమిటీ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటికో మహిళ పారిశ్రామికవేత్త కావాలి



**మందస, ఫిబ్రవరి 2(వార్త):** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇంటికో మహిళ ఎంటర్ప్రెనర్ కావాలన్న సంకల్పం సఫలీకృతం కావడానికి అందరూ బాధ్యత వహించాలని వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండల వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఔత్సాహిక మహిళలతో ఏర్పాటు చేసిన వర్క్ షాప్ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పంచ సూత్రాలు పాటిస్తూ, రికార్డుల నిర్వహణ ఖచ్చితంగా ఉన్న సంఘాలలో మహిళలకు వక్తిగతంగా యూనిట్స్ పెట్టుకోవటానికి ప్రభుత్వం అవకాశం ఇస్తున్నందున ఉత్సాహం ఉన్న మహిళలు వ్యాపార సంబంధిత అనుమతులైన ఉద్యమాధార్, ఫుడ్ సర్టిఫికెట్స్ తదితర అంశాలపై ప్రత్యేకంగా అవగాహనతో పాటు అనుమతులు పొంది, వ్యాపార అభివృద్ధికి కావలిసిన పరపతి సౌకర్యాన్ని స్త్రీనిధి ద్వారా బ్యాంకుల ద్వారా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో మండల సమాఖ్య సిబ్బంది కళ్యాణి, రాజారావు, సంస్థ ప్రతినిధులు రవణమ్మ, శారద, శైలజతో పాటు క్లస్టర్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## శరవేగంగా సరుబుజ్జిలి రోడ్డు పనులు



**సరుబుజ్జిలి, ఫిబ్రవరి 2(వార్త):** మండల హెడ్ క్వార్టర్ లోరోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. రూ.12 కోట్లు ఖర్చుతో రోడ్డు విస్తరణ, ఆక్రమణ తొలగింపు పనులను చేపట్టారు. ఇందులో భాగంగానే సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్ నుంచి అమృతలింగానగరం సమీపంలో ఉన్న ఫారెస్ట్ రోడ్డు వరకు అలికాం–బత్తిలి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. రోడ్డు నిర్మాణ పనులను మరో నెల రోజుల్లో పూర్తి చేస్తామని ఆర్ అండ్ బి జెఇ తెలిపారు.

## ఈ పంట నమోదు తప్పనిసరి




**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 2 (వార్త):** సోంపేట ఏడీఏ భవానీ శంకర్ ఆధ్వర్యంలో ఈపంట బుకింగ్ పురోగతిని క్షేత్రస్థాయిలో వీఏఏల పనితీరును పర్యవేక్షించారు. గ్రామాల్లో పంటల నమోదు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి, ర సూచనలు ఇచ్చారు. వీఏఏలు రైతుల ఈపంట వివరాలు నమోదు చేస్తూ, ఏపీఏఐఎంఎస్‌లో కూడా వ్యక్తిగత రైతులు స్వయంగా నమోదు చేసుకునే విధానాన్ని వివరించారు. నమోదు ఆలస్యం కాకుండా లక్ష్యాల ప్రకారం రోజువారీ పురోగతి సాధించాలని ఆదేశించారు. రైతులు సకాలంలో ఈపంట నమోదు చేసుకుని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి పోటీల్లో కుమారి ప్రతిభ



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 3(వార్త):** జిల్లా స్థాయి గ్రిక్స్ క్రీడలు బాలికలకు గతనెల 31న శ్రీకాకుళం లో కోడి రామ్మూర్తి స్టేడియం లో గేమ్స్, అథ్లెటిక్స్ నిర్వహించారు. అథ్లెటిక్స్ నందు 3000 మీటర్స్ , 1500 మీటర్స్ పరుగు పందెం విభాగంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇచ్ఛాపురం విద్యార్థిని డి.కుమారిపై రెండు ఈవెంట్లో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్స్ తీసుకున్నారు. కుమారిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.సూర్యారావు, ఇతర ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు గణేష్, రంగారావు అభినందనలు తెలియజేశారు.

## ఘనంగా ఎంపీపీ పుష్ప జన్మదిన వేడుకలు

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 3(వార్త):** ఎంపీపీ బోర పుష్ప జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్ రెడ్డి కేదారి, మందకిని, బాబూరావు,త్రినాధ రెడ్డి వివేకానంద రెడ్డి నారాయణ మోహన్ రావు పరశురాము,తులసీ రాం,కృష్ణా రెడ్డి నూకయ్య రెడ్డి మోహన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.



## కనకదుర్గ అమ్మవారికి ఎమ్మెల్యే బగ్గు ప్రత్యేక పూజలు


**పోలాకి, ఫిబ్రవరి 2 (వార్త):** పోలాకిలోని కనకదుర్గ అమ్మవారి జాతర మహోత్సవం భక్తిశ్రద్ధలతో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పోలాకి పిఎసిఎస్ ఛైర్మన్ భైరి భాస్కరరావు, కిల్లి వేణుగోపాలస్వామి, సూరపు నాని, డోల శ్రీను, లుకలాపు చిన్నబాబు, తెంబూరు గౌరినాయుడు, భైరి అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. జాతర సందర్భంగా పోలాకి గ్రామం భక్తులతో కిటకిటలాడుతూ ఆధ్యాత్మిక వాతావరణంతో సందడి నెలకొంది.



# జీఆర్‌ఏఎంజీ-2025 చట్టాన్ని రద్దు చేయాలి

### ఏపీ రైతు సంఘం, సీఐటీయూ వినతి

**మందస, ఫిబ్రవరి 2(వార్త):** మోడీ తీసుకు వచ్చిన జీఆర్ఎఎంజీ-2025 చట్టాన్ని రద్దు చేయాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005ను పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు పి.దేవేంద్ర, ఎం.ధర్మారావు, సీఐటీయు మండల కార్యదర్శి కె.కేశవరావు డిమాండ్ చేశారు. మందస, బైరిసారంగపురం గ్రామ సచివాలయాల్లో సచివాలయ అధికారులకు వినతి పత్రాలు అనదేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎం, వామపక్ష పార్టీల మద్దతుతో ఆధారపడిన యుపిఎ- 1 ప్రభుత్వం వామపక్ష పార్టీల ఒత్తిడి, కృషితో వచ్చిన 2005 మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మోడీ ప్రభుత్వం రద్దు చేయడంతో గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కూలీలకు, పేద రైతులకు నష్టమని, పని హక్కు పోతుందన్నారు. ఈ పథకం అమలు వల్ల వ్యవసాయ కార్మికులకు పని గ్యారంటీ కలిగిందన్నారు. కార్పొరేట్ల ఒత్తిడితోనే కొత్త చట్టం తెచ్చారన్నారు. కార్పొరేట్ వర్గాలు చౌక శ్రమ కోసం, వేతనాలు తగ్గింపు కోసం లేబర్ కోడ్లు తెచ్చారని, అదనపు కార్మికుల కోసం గ్రామీణ ప్రాంతాల నుండి వలసలు పెంచాలంటే గ్రామీణ ఉపాధిహామీ చట్టం మార్చాలని ఒత్తిడి చేశారన్నారు. ఎక్కువ మంది లేబర్ ఉంటే తక్కువ వేతనాలతో పని చేయించుకొని ఆర్థిక లాభం పొందవచ్చన్న కార్పొరేట్ల దురాలోచన, మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పథకంను నిర్వీర్యం చేస్తూ వచ్చారన్నారు. 2021లో ఈ పథకానికి, రూ. లక్షా 11 వేల కోట్లు కేటాయించగా, 2024లో 2025లో కేవలం రూ.86 వేల కోట్లు మాత్రమే కేటాయించాని, పేదలకు ఉపయోగపడే ఈ పథకానికి నిధులు కేటాయించలేదన్నారు. కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు మాత్రం లక్షల కోట్ల రూపాయలు సబ్సిడీ రూపంలో అప్పగిస్తున్నారని, మొండి బాకీల పేరుతో దాదాపు 12లక్షల కోట్ల రూపాయలు బడా బాబుల అప్పులు రద్దు చేశారన్నారు. 3లక్షల కోట్ల పన్నులు రద్దు





చేశారని, వేల కోట్లు రాయితీలిచ్చారన్నారు. నామమాత్ర ధరలకు భూమి, నీరు, విద్యుత్, ఖనిజాలు కట్టబెడుతున్నారని, రైతుల వద్ద లాక్కున్న భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారన్నారు. కార్పోరేట్ల, పెట్టుబడిదారుల సేవలో మోడీ ప్రభుత్వం తరిస్తున్నదని, పేదలకు వ్యవసాయ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నదన్నారు. 2005 గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కేంద్రం 90 శాతం నిధులు ఇస్తే, రాష్ట్రాలు 10% భరించేవని, ఈ కొత్త చట్టంలో 60% కేంద్రం, 40% రాష్ట్రాలు భరించాలని చెప్పిందన్నారు. ఇప్పటికే అప్పుల్లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకానికి నిధులు కేటాయించలేవన్నారు. రాష్ట్రాలు ఖర్చు పెట్టాక కేంద్రం నిధులిస్తుందని, ఈ పథకాన్ని క్రమేపి ఎత్తివేసే దురుద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తెచ్చిందన్నారు. ఇటువంటి పథకాన్ని మన రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించడం సిగ్గుచేటన్నారు. దశాబ్దాలు పాటు కార్మికవర్గం అశేష త్యాగాలతో పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులు కాలరాస్తూ 29 కార్మిక చట్టాలు స్థానంలో 4 లేబర్ కోడ్లుగా తెచ్చారన్నారు. కార్పొరేట్ ల ప్రయోజనాలకు కార్మిక వర్గాన్ని మరింత శ్రమ దోపిడీ చేసి ఆధునిక బానిసలుగా మార్చడానికి లేబర్ కోడ్లు తెచ్చారన్నారు. ప్రజలపై భారాలు వేసి ప్రైవేట్ విద్యుత్ కంపెనీలకు అధిక లాభాలు వచ్చే విధంగా కొత్త విద్యుత్ చట్టం తెస్తున్నారని అన్నారు. 1966 నాటి పాత చట్టాన్ని మార్చి తెస్తున్న విత్తనాల బిల్లు రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందని, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని అన్నారు. ప్రజా పోరాటాలుపై నిర్బంధము ప్రయోగిస్తున్నారని, పీడీ చట్టం ఉపయోగించి జైలులో పెడుతున్నారని అన్నారు. నిరసనలను, భావప్రకటనా స్వేచ్ఛను హరించే చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి తెచ్చిన చట్టానికి టిడిపి జనసేన మద్దతు పలకడం దుర్మార్గమని విమర్శించారు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన దుష్ట చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టి.అంజయ్య పి.అప్పలస్వామి ఎస్.వల్లభ, సీహెచ్ రమణ కె.దానయ్య తదితరులు పాల్గొన్నారు.

## బుడితి సీహెచ్‌సీ ప్రహరీకి శంకుస్థాపన



**సారవకోట, ఫిబ్రవరి 2(వార్త):** బుడితి సామాజిక ఆరోగ్య కేంద్రానికి 18 లక్షల రూపాయలతో మంజూరైన ప్రహరీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఆసుపత్రి భద్రతను మరింత మెరుగుపరచడంతో పాటు రోగులకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఈ ప్రహరీ నిర్మాణం చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగానే ఈ పనులు మంజూరయ్యాయన్నారు. ప్రహరీ నిర్మాణం పూర్తయితే ఆసుపత్రి పరిసరాలు సురక్షితంగా మారడంతో పాటు రోగులు, వారి కుటుంబసభ్యులకు సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్లెక్సీలు తొలగించాలని ఫిర్యాదు



**నరసన్నపేట, ఫిబ్రవరి 2(వార్త):** నరసన్నపేట ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్లపై ఏర్పాటు చేసిన ప్రచార ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని కోరుతూ మల్లేశ్వరరావు సోమవారం జిల్లా ఫిర్యాదుల విభాగంలో ఫిర్యాదు చేశారు. రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల వల్ల పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆయన ఆవే దన వ్యక్తం చేశారు. ఈ విషయమై జిల్లా సబ్ కలెక్టర్, డీపీవోలకు వినతిపత్రం అంద జేసినట్లు తెలిపారు. గత 23 రోజులుగా ఫ్లెక్సీల తొలగింపులో సంబంధిత పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజల భద్రత దృష్ట్యా తక్షణమే చర్యలు చేపట్టి ఫ్లెక్సీలను తొలగించాలని ఆయన కోరారు.

## తిలారు పాఠశాలను పరిశీలించిన ఎంఈఓ



**జలుమూరు, ఫిబ్రవరి 2 (వార్త):** తిలారు (ఆర్ఎస్) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ--1 బమ్మిడి మాధవరావు సోమవారం సందర్శించారు. ఉదయం పాఠశాలకు చేరుకున్న ఆయన విద్యార్థుల హాజరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సమయానికి పాఠశాలకు హాజరయ్యేలా ప్రత్యేకంగా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థుల హోంవర్క్‌లు, వర్క్‌బుక్స్‌ను పరిశీలించిన ఎంఈఓ పలు సూచనలు అందజేశారు. బోధనా నాణ్యత మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని, వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఆయన ఉపాధ్యాయులను ఆదేశించారు.

## రాష్ట్రస్థాయి పోటీల్లో మనోజ్‌కు మూడో ర్యాంక్




**జలుమూరు, ఫిబ్రవరి 2(వార్త):** కరవంజ మోడల్ స్కూల్‌లో ఏడవ తరగతి చదువుతున్న గొల్లంగి మనోజ్ రాష్ట్రస్థాయిలో ఇటీవల నిర్వహించిన ఎడ్యుకేషన్ పోటీలలో మూడవ ర్యాంక్ సాధించి మండలానికి గర్వకారణంగా నిలిచాడు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన బహుమతి ప్రదాన కార్యక్రమంలో మనోజ్‌కు రూ.10,000 పురస్కారంగా అందజేశారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రిన్సిపల్ శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి ప్రతిభను అభినందిస్తూ, అతని విజయానికి సహకరించిన ఉపాధ్యాయుల కృషిని కూడా ఆయన కొనియాడారు. మనోజ్ సాధించిన ఈ ఘనతతో పాఠశాలలో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి.

## న్యాయవాదిని కోల్పోవడం బాధాకరం



**పలాస, ఫిబ్రవరి 2 (వార్త):** పలాస కోర్టులో గత 20 సంవత్సరాల నుంచి న్యాయవాదిగా పని చేస్తూ కిడ్నీ వ్యాధితో ఆకస్మికంగా మృతి చెందిన యువకుడు ఉత్సాహంతులు కొర్ల మన్మధ మృతిచెందరం ఎంత ఎంతో బాధాకరమని అధ్యక్షులు సీనియర్, జూనియర్ న్యాయవాదులు అన్నారు. గత బుధవారం పలాస కిడ్నీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మన్మధరావు మృతి చెందారు. ఈ సందర్భంగా పలాస కోర్టులో సోమవారం బార్ అసోసియేషన్ హాల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గని (ఫజాబ్ అహ్మద్) ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ జూనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ కోర్ల మన్మధరావు విభేదాలు దూరంగా అందరితో స్నేహం తో మెలిగే వారిని, ఇంత చిన్న వయసులో ఆయన మృతి చెందిన ఎంతో బాధాకరమని అన్నారు. ఒక స్థిరవంతుడిగా ఒక సామాజిక వర్గంలో పెద్దగా ఆయన గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేస్తూ అందరికీ ఎన్నో సేవలు అందించి ఎంతో మంది పేదలకు ఉచితంగా న్యాయ సేవలు కూడా అందించారని, అటువంటి వ్యక్తి మన మధ్యలో లేకపోవడం బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని దేవుణ్ణి ప్రార్థిస్తూ ప్రగాఢ సంతాపాన్ని వారి కుటుంబ సభ్యులకు తెలియజేస్తున్నాను. ఆయన ఆత్మ శాంతికి న్యాయవాదులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కోశాధికారి పలువురు సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

**జలుమూరు, ఫిబ్రవరి 2 (వార్త):** రావిపాడు ప్రభుత్వ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) మాధవరావు సోమవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీఎఫ్ఎల్ఎన్ (ఖీశీబఅఞఅశీఖ్రీ రాణ్‌వత్తీఖ౩ఎ ౘ చీబఎవత్తీఖ౩ఎ) కార్యక్రమం అమలుపై విద్యార్థులను గణితాలు, అక్షరాలు తదితర అంశాలపై ప్రశ్నలు అడిగి వారి అవగాహనను పరీక్షించారు. అనంతరం పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని విద్యార్థులకు సూచించారు. అలాగే విద్యార్థులకు వేడి భోజన పదార్థాలు అందించే విషయంలో పరిశుభ్రతతో పాటు జాగ్రత్తలు పాటించాలని మధ్యాహ్న భోజన పథకం బాధ్యతలు నిర్వహిస్తున్న మెండ వైకుంఠరావుకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



# డంపింగ్‌యార్డులా నాయుడు కోనేరు

### -అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆవేదన

**నరసన్నపేట, ఫిబ్రవరి 2(వార్త):** సుందరాపురంలో ఉన్న నాయుడు కోనేరు చెరువు డంపింగ్ యార్డును తలపిస్తూ ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. ప్రతి పంచాయతీలో ప్రత్యేకంగా డంపింగ్ యార్డులు ఏర్పాటు చేసినప్పటికీ, స్థానికులు వినియోగించే వ్యర్థాలను చెరువులో పడేయడంతో నీరు తీవ్రంగా కలుషితమవుతోంది. చెరువులో ప్లాస్టిక్, గృహ వ్యర్థాలు పేరుకుపోయి పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వ్యాపిస్తుండటంతో పాటు, నీటి వనరుల భద్రతపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై గ్రామ సర్పంచ్ ఎన్నోసార్లు చర్యలు చేపట్టినప్పటికీ పరిస్థితిలో గణనీయమైన మార్పు కనిపించడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. చెరువు కలుషితంతో పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. చెరువును పరిశుభ్రంగా ఉంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, పర్యవేక్షణను కఠినతరం చేయడం అవసరమని గ్రామస్తులు సూచిస్తున్నారు.



# పాఠశాలే ఇల్లు.. విధులే పరమావధి

### మోడల్ ప్రైమరీ స్కూల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు మెండ రామారావు




**జలుమూరు, ఫిబ్రవరి 2(వార్త):** పాఠశాలనే తన ఇల్లుగా, ఉద్యోగాన్నే జీవిత లక్ష్యంగా భావిస్తూ విద్యాబోధనకు అంకితమైన ఉపాధ్యాయుడు మెండ రామారావు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. జలుమూరులోని మోడల్ ప్రైమరీ స్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన ఉదయం 8:30 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు నిరంతరం బోధనా కార్యక్రమాల్లో నిమగ్నమై ఉంటూ విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణానికి కృషి చేస్తున్నారు. విధి నిర్వహణతోనే కాకుండా సెలవు దినాల్లో కూడా పాఠశాల ప్రాంగణంలో మొక్కలను సంరక్షించడం, పరిశుభ్రత పాటించడం ద్వారా పాఠశాల వాతావరణాన్ని ఆహ్లాదకరంగా మార్చారు. సుమారు రెండు సంవత్సరాల క్రితం మండలంలోనే అపరిశుభ్రంగా ఉన్న ఈ పాఠశాలను తన పట్టుదల, కష్టశ్రమతో నేడు రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందే ఉత్తమ పాఠశాలగా తీర్చిదిద్దడం విశేషం. ఆయన అంకితభావం, నిబద్ధత, శ్రమ ఫలితంగా పాఠశాల రూపురేఖలు మారడమే కాకుండా విద్యార్థుల్లో విద్యపై ఆసక్తి పెరిగిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. మెండ రామారావు కృషిని మండల విద్యాశాఖ అధికారులు సైతం కొనియాడుతూ ప్రశంసలు కురిపిస్తున్నారు. ఉపాధ్యాయుడు అంటే కేవలం బోధకుడు మాత్రమే కాదని, సమాజ నిర్మాణకర్త కూడా అన్నదానికి ఆయన ఉదాహరణగా నిలుస్తున్నారు.

# 'అంబటి'పై హత్యాయత్నం అమానుషం

### - వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి



**పలాస, ఫిబ్రవరి 2(వార్త):** మాజీమంత్రి అంబటి రాంబాబు నివా సంపై జరిగిన దాడి ప్రజాస్వామ్యంలో మాయని మచ్చని , ఇది ముమ్మా టికి అనాగరిక చర్య అని వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు తీవ్రంగా కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. సోమవా రం పలాసలోని వైసిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అంబటి రాంబాబును పోలీసులు అరెస్టు చేయడం అత్యంత హేయమని, ఇది తెలుగుదేశం ప్రభుత్వ నియంతృత్వ పాలనకు నిదర్శనమని మండ పడ్డారు. అంబటి రాంబాబును అరెస్టు చేసే క్రమంలో పోలీసులు ప్రవ ర్తించిన తీరు. తెలుగుదేశం పార్టీ గూండాలు చేసిన రౌడీయిజంపై ప్రజలు చర్చించుకుంటున్నారని చెప్పారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా చంద్రబాబు వ్యాఖ్యలు చేయడం దారుణం అన్నారు. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు, పంది కొవ్వు కలిసిందంటూ ఎలాంటి ఆధారాలు లేకుండా సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి మాట్లాడడాన్ని హేయ మైన చర్యగా అభివర్ణించారు. సి.బి.ఐ ఇచ్చిన నివేదిక కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు అన్నారు. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో సిబిఐ ఆధ్వర్యంలో సిట్ నివేదిక సమర్పించడంతో, చంద్రబాబు చేసిన ఆరోపణలపై క్షమాపణలు కోరకుండా వెంటనే మాట మార్చి పంది కొవ్వు కాదని, కొన్ని రసాయనాలు కలిసాయంటూ మళ్లీ కొత్త రాగం అందుకుంటున్నారని విమర్శించారు. ఈ దాష్టికాన్ని చూస్తే రాష్ట్రంలో అరాచక, దుర్మార్గ పాలన నడుస్తుందనే విషయం అర్థమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, డైవర్షన్ రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. చంద్రబాబు కూటమి పాలనలో రాష్ట్ర మంత్రిగా కొనసాగుతున్న ఆయన తనయుడు నారా లోకేష్ పరిపాలనలో వైఫల్యం చెందినప్పటికీ, ఎలాగైనా రాష్ట్ర ముఖ్యమంత్రిగా కుమారుడికి చేయాలన్న సంకల్పంతో చంద్రబాబు రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చి, తన పంతం నెగ్గించుకునే దుర్మార్గపు ఆలోచనతో ప్రజా కంటక పాలన సాగిస్తున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో గుండా రాజ్ పాలనకు కూటమి ప్రభుత్వం తక్షణం స్వస్తి పలికి, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రజాస్వామ్యం కాపాడేలా కూటమి ప్రభుత్వ భాగస్వామ్య పార్టీలు ఆలోచించాలని బమ్మిడి దుర్యోధనరావు సూచించారు.

## శ్రీరాంపురం గురుకుల పాఠశాలలో చేరికకు దరఖాస్తుల ఆహ్వానం



**నరసన్నపేట, ఫిబ్రవరి 2 (వార్త):** శ్రీరాంపురం మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఐదవ తరగతిలో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పాఠశాల ప్రిన్సిపల్ రాయి కన్నా తెలిపారు. సోమవారం పాఠశాలలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 4వ తేదీ నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు విద్యార్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ విద్యాసంవత్సరానికి మొత్తం 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని, ప్రవేశానికి సంబంధించిన పరీక్షను ఏప్రిల్ 12వ తేదీన నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు.

## రాష్ట్రస్థాయి ఈఈఎంటీ పరీక్షల్లో పోలాకి ఆదర్శ పాఠశాల విద్యార్థినుల ప్రతిభ

**పోలాకి, ఫిబ్రవరి 2 (వార్త):** రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఈఈఎంటీ ప్రతిభ పరీక్షలలో పోలాకి మండలం ఈదులవలస ఆదర్శ మోడల్ స్కూల్ విద్యార్థిని మేఘన మొదటి స్థానంలో నిలిచి పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. ఆదివారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో మేఘన అవార్డును అందుకుంది. అదేవిధంగా, ఇదే పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని ఝాన్సీ బ్రిక్స్ పోటీలలో తన ప్రతిభను చాటుకుంది. 800 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్, 1500 మీటర్ల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించి విశేషంగా మెరిసింది. ఈ విజయాల సందర్భంగా సోమవారం పాఠశాల ప్రిన్సిపల్ ప్రవీణ్ గారు, ఉపాధ్యాయులు విద్యార్థినులను అభినందిస్తూ వారి కృషిని కొనియాడారు. ఈ విజయాలు ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తున్నాయని వారు పేర్కొన్నారు.



## తామరాపల్లి గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం


**నరసన్నపేట, ఫిబ్రవరి 2(వార్త):** తామరపల్లి గ్రామంలో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల (బాలికలు)లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కృష్ణ తార తెలిపారు. ఎంపీసీ, బైపీసీ (ఇంగ్లీష్ మీడియం) గ్రూపులలో మొత్తం 160 సీట్లు భర్తీ చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. అర్హత గల విద్యార్థినులు ఫిబ్రవరి 19వ తేదీలోగా ప్రవేశ పరీక్షా రుసుము రూ.100 చెల్లించి https://apbragcet.apcff.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సూచించారు. గురుకుల కళాశాలలో నాణ్యమైన విద్యతో పాటు వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఈ అవకాశాన్ని అర్హులైన బాలిక విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ కృష్ణ తార విజ్ఞప్తి చేశారు.




# వాసుదేవుని.. బ్రహ్మోత్సవాలకు వేళాయె

* 7 నుంచి 13వరకు బ్రహ్మోత్సవాలు * ముస్తాబవుతున్న మందస
* ప్రముఖులకు ఆహ్వానం పలుకుతున్న శ్రీవాసుదేవసేవాసమితి
* ఏర్పాట్లు పరిశీలించిన పోలీసు అధికారులు



**మందస, ఫిబ్రవరి 2(వార్త):** మందస పట్టణంలోని శ్రీవాసుదేవపెరుమాళ్ బ్రహ్మోత్సవాలు ఈనెల 7వ తేది నుంచి 13వ తేది వరకు జరుగనున్నాయి. ఈ ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరపడానికి నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. వాసుదేవుని 17వ బ్రహ్మోత్సవాలు కావడంతో శ్రీవాసుదేవసేవాసమితి, ఆలయ అభివృద్ధి కమిటీ, భక్తులు ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి శ్రమిస్తున్నారు. బ్రహోత్సవాలకు మందస పట్టణం ముస్తాబవుతోంది. శ్రీవాసుదేవ పెరుమాళ్ ఎంతో చారిత్మాక ఆలయం. 14వ శతాబ్దానికి చెందినది. ఒడిశాశిల్పులు ఆలయాన్ని నిర్మించడంతో ఒడిశాలోని ఎంతో ప్రసిద్ధి చెందిన లింగరాజు ఆలయాన్ని వాసుదేవ ఆలయం పోలి ఉంటుంది. ఉత్కళ సంస్కృతి ఆలయంలో కనిపిస్తోంది. కాంచిపురంలోని శ్రీవరదరాజస్వామి ఆలయం ప్రాంతంలో స్వామివారి విగ్రహాన్ని శిల్పులు తయారు చేశారు. కృష్ణశిలతో శ్రీవాసుదేవుని నిజస్వరూపాన్ని చెక్కారు. మందస సంస్థానాన్ని రాజుల పరిపాలించే కాలంలో ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. వారి హయాంలో స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగేవి. రాజరిక పాలనలో తొమ్మిది రోజుల పాటు వాసుదేవుని బ్రహ్మోత్సవాలు నిర్వహించేవారు. రాజరిక పాలన అంతరించడంతో కాలక్రమేణా బ్రహ్మోత్సవాలు నిలిచిపోయాయి. శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి ఆధ్వర్యంలో 2010వ సంవత్సరం ఫిబ్రవరి 5వ తేదీన బ్రహ్మోత్సవాలు పునః ప్రారంభించారు. ఈ ఏడాది కూడా ఫిబ్రవరి 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకు మందస శ్రీ వాసుదేవస్వామి 17వ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ప్రత్యేకంగా త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి, త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ అహోబిలస్వామి జీయర్ స్వామి లతో పాటు ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులను కూడా బ్రహ్మోత్సవాలకు రావాలని ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులను ఆహ్వానిస్తున్నారు.



### ఆలయ ప్రాముఖ్యం-విశిష్టత

1744వ సంవత్సరంలో వాసుదేవుని ఆలయాన్ని మందస సంస్థానానికి విద్వాంసులుగా నరసాపురానికి చెందిన తెలికిచర్ల కందాడ రామానుజాచార్యస్వామి విద్వాంసులుగా ఉంటూ ఆలయానికి స్థానాచార్యులుగా ఉండేవారు. ఈతని వద్ద త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ పెద్ద జీయర్ స్వామి, గోపాలాచార్య స్వామి శిష్యులుగా ఉండేవారు. వాసుదేవుని ఆలయప్రాంగణంలో ఉన్న వేద పాఠశాలలో వీరు ఇరువురు చేరి వేదంపండిత విద్యను అభ్యసించారు. ఈ వేద పాఠశాలలో ఎంతో మంది ప్రముఖులు వేదాంత విద్యను అభ్యసిస్తూ. వాసుదేవుని ఆలయంలో నిత్యపూజలు జరిపేవారు ప్రతి ఏటా అంగరంగ వైభవంగా తొమ్మిది రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు అప్పటి రాజరిక పాలనలో ఉన్న ఇరుగుపొరుగు రాజ్యాల నుంచి అశేష భక్త జనులు వచ్చేవారని ప్రతీతి.

### ఆలయాన్ని దత్తత తీసుకున్న చిన్నజీయర్ స్వామి

రాజరిక పాలన అంతరించిన తరువాత కొన్ని దశాబ్దాల పాటు ఆలయం మూతబడి, శిథిలావస్థకు చేరుకుంది. శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ పెద్ద జీయర్ స్వామి, గోపాలాచార్యస్వామిల వద్ద త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి శిష్యరికం చేశారు. ఆయన వాసుదేవుని ఆలయాన్ని చారిత్రక ప్రాముఖ్యతను గుర్తించి గురువుల స్మారకార్థం అభివద్ధి చేసేందుకు సంకల్పించారు. ఈ ఆలయాన్ని పునఃప్రతిష్ఠించేందుకు పూనుకున్నారు. 2000 జూలై 7వ తేదీన చిన్న జీయర్ స్వామి సారథ్యంలోని మధుభయ వేదాంత ఆచార్య పీఠం దేవాదాయశాఖ నుంచి వాసుదేవుని ఆలయంపై సర్వహక్కులు తీసుకుంది. శిథిలావస్థకు చేరిన ఆలయం 2001 నుంచి ఆలయ పునర్నిమాణ పనులు చేపట్టారు. నిర్మాణానికి సుమారు రూ. 2కోట్లు వెచ్చించారు. ఒడిశాకు చెందిన శిల్ప కళాకారులను తెప్పించి పూర్వకళాకృతిలో నిర్మాణం జరిపారు. 2009 ఫిబ్రవరి 19వ తేదీన సాంప్రదాయబద్ధంగా వేదపండితులతో అంగరంగ వైభవంగా పునఃప్రతిష్టించారు. రాజరిక పాలనలో ఉన్న విగ్రహాన్నే యథావిధిగా పునఃప్రతిష్టించారు. శ్రీవాసుదేవుని తిరుపతి కొండపై ఉన్న వెంకటేశ్వరస్వామి విగ్రహం మాదిరిగానే నల్లరాతితో వాసుదేవుని నిజరూపం ఉండడం విశేషం. గత 16 ఏళ్లుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు ఈ ప్రాంతీయులే కాకుండా ఇతర జిల్లాల నుంచి, రాష్ట్రాల నుంచి భక్తులు వస్తూ ఉంటారు. శ్రీవాసుదేవ పెరుమాళుని బ్రహ్మోత్సవాలకు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాటు చేస్తున్నామని ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులైన గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు తెలిపారు. వేల సంఖ్యలో భక్తులు హాజరయ్యే బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని, భక్తులకు భోజన ఏర్పాట్లు, మంచినీటి సౌకర్యం, దైవ దర్శనం చేసుకునే సమయంలో తోపులాటలు జరుగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.





## త్రోబాల్ పోటీల్లో రన్నర్స్‌గా సత్యసాయి విద్యార్థులు



**పలాస, ఫిబ్రవరి 2 (వార్త):** శ్రీకాకుళం కోడిరామమూర్తి స్టేడియంలో ఇటీవల నిర్వహించిన ఇంటర్ స్కూల్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో రామకృష్ణాపురంలోని సి సత్య సాయి విద్య విహార్ కు చెందిన విద్యార్థులు త్రో బాల్ విభాగంలో రన్నర్స్ గా విజయం సాధించారు. 76వ శ్రీకాకులము జిల్లా గ్రిక్స్ బాల బాలికల ఫైనల్ మీట్ ఆటలపోటీలలో బాగంగా జరిగిన త్రో బాల్ పోటీలలో, 15 జట్లు పాల్గొనగా, స్వామివారి అపారమైన కృపాకటాక్షములతో శ్రీ సత్యసాయి విద్యావిహార్ రామక్రిష్ణపురము విద్యార్థినిలు గట్టి పోటీ ఇచ్చి ద్వితీయస్థానములో నిలిచి, రన్నర్స్ గా బహుమతులు, సర్టిఫికేట్ లు కైవాసం చేసుకున్నారు. సందర్భంగా శ్రీ సత్యసాయి విద్యావిహర్ రామక్రిష్ణపురము ప్రాంగణంలో ద్వితయ స్థానము కైవసం చేసుకొన్న విద్యార్థినులకు అభినంద సభ ఏర్పాటు చేసి ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు మాట్లాడుతూ ఈ స్కూల్ లో మానవతా విలువలతో కూడిన విద్య, వినయము, విజ్ఞానంతో పాటుగా క్రీడల్లో మంచి నైపుణ్యము విద్యార్థులు సాధించడము ఎంతో ఆనందదాయకం తెలియచేసుకొంటూస్కూల్ మెమంటోస్, స్కూల్ సర్టిఫికెట్ లు అందించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, పి ఈ టి లు కిరణ్, గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలు.. గడువులోగా పరిష్కరిస్తాం

* ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట
* శ్రీకాకుళం, టెక్కలిలో గ్రీవెన్స్ నిర్వహణ
* టెక్కలిలో అర్జీలు స్వీకరించిన కలెక్టర్



**శ్రీకాకుళం/ టెక్కలి, ఫిబ్రవరి 2(వార్త):** ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, గడువులోగా పరిష్కరించడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాలో రెండు చోట్ల ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈసారి కలెక్టర్ స్వయంగా టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ క్లినిక్ పేరిట నిర్వహించిన గ్రీవెన్స్‌లో పాల్గొని బాధితుల నుంచి వినతులను స్వీకరించారు. వినూత్నంగా క్షేత్రస్థాయి అధికారులతో కలిసి సమస్యల తీవ్రతను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల సేకరణ కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ శాఖ, పంచాయతీ రాజ్ విభాగాల సమన్వయంతో వినతులు స్వీకరించారు. డీఆర్డీఏ పీడీ కిరణ్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య డి ఎస్ ఓ సూర్య ప్రకాశ్ లు అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను నమోదు చేసుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల వరకు రెండు చోట్ల కలిపి మొత్తం 182 అర్జీలు నమోదయ్యాయి. అత్యధికంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ విభాగంలో 51 వినతులు రాగా, రెవెన్యూ శాఖకు సంబంధించి 31 ఫిర్యాదులు అందాయి. మిగిలిన వాటి వివరాలు ఇలా ఉన్నాయి. పంచాయతీ రాజ్ 21, భూమి రికార్డులు (సర్వే) 10, హౌసింగ్ కార్పొరేషన్ 10, విద్యుత్ శాఖ 7, టిడ్కో 7, వ్యవసాయం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ చెరి 5 దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొని తమ విభాగానికి సంబంధించిన సమస్యలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. సాధ్యమైనంత త్వరగా వీటికి పరిష్కారం చూపిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

### అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు: కలెక్టర్ హెచ్చరిక

టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతులను స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎంతో ఆశతో, సుదూర ప్రాంతాల నుండి గ్రీవెన్స్‌కు వస్తారని, వారి సమస్యలను పరిష్కరించడంలో అధికారులు ఏమాత్రం నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. అర్జీ ఏ స్థాయిలో పెండింగ్‌లో ఉన్నా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా భూ సమస్యలు, రేషన్ కార్డులు, పింఛన్లకు సంబంధించిన వినతులను క్షేత్రస్థాయిలో విచారించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. నాణ్యమైన పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. ఆర్డీవో కృష్ణమూర్తి.. వినతుల కోసం 5 కౌంటర్లు ఏర్పాటు చేయగా డివిజన్‌లో 8 మండలాల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులను పూర్తి స్థాయిలో పరిష్కారం చూపాలి

* ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



**శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 2(వార్త):** జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పిర్యాదులు స్వీకరణ మరియు పరిష్కారం కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుంచి మొత్తం 61 ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను విన్నారు. ప్రతి ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుని, త్వరితగతిన, న్యాయపరంగా పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని చెప్పారు. ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం, నిర్లక్ష్యం సహించబోమని, నిర్ణీత గడువులో విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భూ సమస్యలు, ఆస్తి తగాదాలు, కొట్లాటలు,వ్యక్తిగత తగాదాలు, మోసపూరితమైన ఫిర్యాదులు, కుటుంబ సమస్యలు వంటి ఫిర్యాదులు ఎక్కువగా అందాయి.

## 7న జిల్లా సమీక్షా కమిటీ సమావేశం

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 2(వార్త):** జిల్లా అభివృద్ధిపై సమీక్షించేందుకు ఈనెల 7వ తేదీ శనివారం జిల్లా సమీక్షా కమిటీ సమావేశం నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, తాగునీరు, ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, నీటి పారుదల, ఉపాధి హామీ వంటి కీలక అంశాలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. ఆయా శాఖల అధికారులు తమ పనులపై సంక్షిప్త నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

## అటవీ శాఖ కార్యాలయంలో పత్రాలు చోరీ చేశారా?

**నరసన్నపేట, ఫిబ్రవరి 2(వార్త):** తామరపల్లి గ్రామంలో ఉన్న అటవీ శాఖ కార్యాలయంలో సోమవారం దుండగులు చొరబడి హల్చల్ చేసిన ఘటన కలకలం రేపింది. ఉదయం కార్యాలయానికి వచ్చిన అధికారులు తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి లోపల పరిశీలించగా, కార్యాలయంలోని బీరువాతో పాటు పలు చోట్ల ధ్వంసం జరిగినట్లు గుర్తించారు. ఈ ఘటనలో కార్యాలయంలోని కీలక పత్రాలు కొన్నివరకు చోరీకి గురై ఉండవచ్చునని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీం సహాయంతో పరిసరాలను నిశితంగా పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించి, దుండగులను గుర్తించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546